సాక్షి నల్లగొండ

శనివారం । 10 । మే । 2025



స్వస్తి వాచనంతో శ్రీకారం

యాదగిరిగుట్టలో శ్రీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలను శుక్రవారం స్వస్తి వాచనంతో ప్రారంభించారు. - 10లో



నేటి నుంచి కల్యాణోత్సవాలు

మట్టపల్లి క్షేత్రంలో శనివారం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40°/26°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్సీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీగా రాజ్‌కుమార్

నల్లగొండ : షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటివరకు జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఎస్సీ సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీగా కొనసాగారు. ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓఎస్డీగా వెళ్లడంతో ఆ బాధ్యతలను రాజ్‌కుమార్‌కు అప్పగించారు.

ఏర్పాట్ల పరిశీలన



ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : ఈ నెల 12న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు నాగార్జునసాగర్ సందర్శనకు వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పరిశీలించారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా ప్రపంచ సుందరీమణులు బుద్ధవనంలో ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. దీంతో విజయ విహార్ అతిథి గృహం, బుద్ధవనంలో ఏర్పాట్లపై సమీక్షించారు.

మెడికల్ వార్డు ఏర్పాటు



ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక మెడికల్ వార్డు

నాగార్జునసాగర్ : ఈ నెల 12న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు నాగార్జునసాగర్ సందర్శనకు రానున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉండేలా హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక మెడికల్ వార్డును ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వుల మేరకు ఐదు పడకలతో అత్యవసర చికిత్స నిమిత్తం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

12న హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

నకిరేకల్ : హ్యాండ్ బాల్ అసోసియేసిన్ ఆధ్వర్యంలో ఈనెల 12న నకిరేకల్ మండలం మంగళపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఉదయం 12 గంటలకు జూనియర్ బాల బాలికల హ్యాండ్ బాల్ జిల్లా జట్టు సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు జూన్ 4 నుంచి 6 వరకు నకిరేకల్‌మండలం మంగళపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరిగే 47 వతెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని తెలిపారు. ఈక్రీడల్లో పాల్గొనే వారు 1 జనవరి 2006 నుంచి 31 డిసెంబర్ 2009 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాంపల్లి : రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నాంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఇబ్బంఇ పెడుతున్నారని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని, ట్రక్‌షీట్ కూడా తీసుకొచ్చి రైతులకు వెంటనే డబ్బులు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, ఆర్డీఓ శ్రీదేవి, తహసీల్దార్ దేవ్ సింగ్, గట్టుపల్లి నర్సిరెడ్డి, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ సెయింట్‌జోసెఫ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ ఎంపిక పోటీలు ముగిశాయి. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జె.కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సబ్ జూనియర్ నెట్‌బాల్ అండర్-16 బాలికల విభాగంలో ఎంపికైన వారిలో జె.సుష్మవిరాజ్, ఎండీ.సభానూర్, బి.కీర్తన, బి.మహేశ్వరి, ఎస్‌కే రిజ్వానా, బి.కరుణ, ఎస్‌కే మహేక్, జె.దీక్షిత, ఆర్.సింధు, ఏ ఐశ్వర్య, సింధు, పూజ, బాలుర విభాగంలో పృథ్వీరాజ్, వెంకటసాయి, నిఖిలేష్, నజీర్, మధు, చైతన్య, సత్యసాయి, కళ్యాణ్, సాత్విక్, కమల్‌తేజ్, కృష్ణ, బాలు ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18 తేదీల్లో జనగాం జిల్లా బతుకమ్మ కుంట క్రీడా మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ లలిత, నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుందరాంగులొస్తారని..

- నేటి నుంచి హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు
- చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లో పర్యటించనున్న పోటీదారులు
- 12న నాగార్జునసాగర్, 15న పోచంపల్లి, యాదగిరిగుట్టకు రాక
- మూడు ప్రాంతాలకు మూడు బృందాలుగా..
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న పర్యాటక శాఖ

ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలు శనివారం నుంచి హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలో పాల్గొనే సుందరీమణులు ఇప్పటికే రాజధానికి చేరుకున్నారు. వారు బృందాలుగా ఏర్పడి తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ ఆలయాలను సందర్శించనున్నారు. అందులో భాగంగా ఈ నెల 12 నాగార్జునసాగర్, 15న యాదగిరి క్షేత్రాన్ని, భూదాన్‌పోచంపల్లిలో పర్యటిస్తారు. వీరి రాకకోసం ఆయా చోట్ల పర్యాటకశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

బుద్ధుడి చెంతకు..

నాగార్జునసాగర్ : ప్రపంచ సుందరీమణులు ఈనెల 12వ తేదీన నాగార్జునసాగర్‌కు రానున్నారు.

- మిస్ వరల్డ్ పోటీ దారులు హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో బయలుదేరి చింతపల్లి సమీపంలోని వెంకటంపేట స్టేజీ వద్దనున్న వెల్లంకి అతిథి గృహం వద్ద 15 నుంచి 30 నిమిషాలు గడపనున్నారు.
- అక్కడి నుంచి నాగార్జునసాగర్ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకుని.. వారికి కేటాయించిన గదుల్లో ముస్తాబవుతారు.
- విజయ విహార్ ఎదుట ఈవెంట్ మేనేజర్ సూచనల మేరకు మీడియా కోసం ఫొటోలు దిగుతారు.
- ఆ తర్వాత విజయ విహార్ వెనకభాగంలో సాగర తీరాన 30 నిమిషాల పాటు ఫొటో షూట్ ఉంటుంది.
- అక్కడి నుంచి వారు వచ్చిన బస్సుల్లోనే బయలుదేరి బుద్ధవనం చేరుకుంటారు. 12న బుద్ధపూర్ణిమ కావడంతో బుద్ధుడి పాదుకల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి నడుచుకుంటూ మహాస్థూపం వద్దకు వెళ్తారు. చివరి మెట్ల మీదునుంచి పైకెక్కి ఫొటో షూట్‌లో పాల్గొంటారు. వారినుంచి వంద అడుగుల దూరంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన గిరిజనుల నృత్యం ఉంటుంది.
- మహాస్థూపం చుట్టూ ఏర్పాటు చేసిన విగ్రహాల్లో ఎంపిక చేసిన వాటి గురించి టూర్ గైడ్ శివనాగిరెడ్డి ప్రపంచ సుందరీమణులకు వివరిస్తారు.



- మహాస్థూపంలోని అష్టబుద్ధుల వద్ద క్యాండిల్స్ వెలిగిస్తారు. అక్కడే వారికి కేటాయించిన సీట్లలో కూర్చుని మూడు నిమిషాలు ధ్యానం చేస్తారు. అక్కడే మరో ఐదు నిమిషాల పాటు మాంగ్స్ చాటింగ్‌లో పాల్గొంటారు. ఐదు నిమిషాల పాటు బుద్ధజయంతి గురించి తెలుసుకుంటారు.
- అక్కడి నుంచి మెట్లు దిగి జాతక పార్కుకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన కుర్చీల్లో ఆసీనులవుతారు. బుద్ధుడి చరిత్ర, తెలంగాణ బుద్ధిజం, బౌద్ధ విశేషాలు తెలుసుకుంటారు. అక్కడే బుద్ధచరితపై డ్రామా ఉంటుంది.
- అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన డిన్నర్‌లో పాల్గొని హైదరాబాద్ బయలు దేరతారు. వారివారి దేశ సంప్రదాయాల మెనూ ప్రకారం హైదరాబాద్ నుంచే భోజనాలను తీసుకురానున్నారు.



హైదరాబాద్‌కు చేరుకున్న మిస్ వరల్డ్ పోటీదారులు

యాదగిరీశుడి దర్శనం

యాదగిరిగుట్ట : మిస్ వరల్డ్ పోటీదారులు ఈ నెల 15వ తేదీన సాయంత్రం 4గంటలకు యాదగిరి క్షేత్రానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి 10 మంది సుందరీమణుల బృందం ప్రత్యేక వాహనాల్లో కొండపైన గల అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడ కలెక్టర్, ఆలయ ఈఓ వారికి స్వాగతం పలుకుతారు.

- అతిథి గృహం నుంచి బ్యాటరీ వాహనాల్లో తూర్పు మాఢవీధిలో ఉన్న అఖండ దీపారాధన చెంతకు చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి భజన, కోలాట బృందాలు వారి ముందు నడుస్తాయి. కూచిపూడి, భరత నాట్యం కళాకారుల స్వాగతం నడుమ వారు తూర్పు ద్వారం నుంచి తిరువీధుల్లో వెళ్తారు. అక్కడ ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలుకుతారు.
- త్రితల ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లి మొదటగా ఆంజనేయస్వామిని, అక్కడే ఉన్న గండబేరుండ నరసింహస్వామిని దర్శించుకుంటారు.
- అక్కడి నుంచి స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి, గర్భాలయంలో శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు.
- గర్భాలయం నుంచి పక్కనే ఉన్న ఆండాళ్ అమ్మవారిని దర్శించుకొని, ముఖ మండపంలోకి వస్తారు. అక్కడ సువర్ణ పుష్పార్చన ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొంటారు. ముఖమండపంలోనే సుందరీమణులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేస్తారు.
- పశ్చిమ ద్వారం నుంచి బయటకు వచ్చి ఆలయ ప్రాకార మండపాలు, మాఢ వీధులను చూసి, అక్కడ ఫొటోలు, వీడియోలు తీసుకొని, తిరిగి అతిథి గృహానికి వస్తారు.

సుందరీమణులకు ప్రత్యేక ప్రసాదం

యాదగిరిశుడిని దర్శించుకునేందుకు వస్తున్న సుందరీమణుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ప్రసాదాన్ని తయారు చేయించనున్నారు. శ్రీస్వామి వారి లడ్డూ, పులిహోర ప్రసాదంతో పాటు సిర, కట్టె పొంగలి వంటి ప్రసాదాలను తయారు చేయించనున్నారు. ప్రసాదాలను అతిథి గృహంలోనే సుందరీమణులకు అందిస్తారు.

అరటి, మామిడి తోరణాలతో..

ప్రపంచ సుందరీమణులు యాదగిరి క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో ఆలయాన్ని తీర్చిదిద్దనున్నారు. ప్రధానాలయ ముఖమండపం, తూర్పు రాజగోపురం వద్ద రంగురంగుల పూలు, అరటి, మామిడి తోరణాలతో అలంకరించనున్నారు. రాత్రి సమయంలో శ్రీస్వామి వారి ఆలయం అద్భుతంగా కనిపించేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లపై ఇప్పటికే కలెక్టర్, డీసీపీలు ఈఓతో చర్చించారు. ఇక పాక్ - ఇండియా సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో సుందరీమణులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



పోచంపల్లిలో 'ఇక్కత్ థీమ్'



స్టాల్స్ ఏర్పాటు చేయనున్న భూదాన్‌పోచంపల్లిలోని టూరిజం ప్రాంగణం

భూదాన్‌పోచంపల్లి : ఇక్కత్ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది, ఉత్తమ పర్యాటక గ్రామంగా యునెస్కో అనుబంధ సంస్థచే అంతర్జాతీయ అవార్డు పొందిన భూదాన్ పోచంపల్లికి ఈనెల 15న మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు వస్తున్నారు. వారి రాక కోసం స్థానిక రూరల్ టూరిజం పార్కులో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. టూరిజం బస్సులో 25 మంది సుందరీమణుల బృందం సాయంత్రం 6 గంటలకు పోచంపల్లికి చేరుకుంటుంది. ఇక్కడ రెండు గంటల గడిపి తిరిగి రాత్రి 8 గంటలకు హైదరాబాద్ వెళ్తారు. అడుగడుగునా ఇక్కత్ థీమ్ ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

- మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లకు టూరిజం ప్రధాన ద్వారం నుంచి లోపలి మ్యూజియం వరకు మహిళలు కోలాటాలతో స్వాగతం పలుకుతారు. వారికి బొట్టుపెట్టి, పూలమాలలు వేసి సత్కరిస్తారు.
- టూరిజం లోపలి ద్వారం వద్ద ముగ్గుల్లో అలంకరించే టెర్రాకోట్ కుండలను ముద్దుగుమ్మలు పరిశీలిస్తారు. లోపలి గచ్చు ప్రాంతంలో మెహందీ వేయడాన్ని తిలకిస్తారు. అందాలభామలు కోరితే వారికి కూడా మెహందీ వేస్తారు. ఇక్కడే లైవ్ మ్యూజికల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి మ్యూజియంలోకి వెళ్తారు.
- మ్యూజియం లోపల ఏర్పాటు చేసిన మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. ఇందుకోసం రెండు మగ్గాలను ఏర్పాటు చేస్తున్నారు.
- అక్కడి నుంచి కాన్ఫరెన్స్ హాల్‌లో స్నాక్ రిఫ్రెష్‌మెంట్ పూర్తయిన వెంటనే అక్కడ నుంచి మ్యూజియం బయటికి వస్తూ టూరిజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండిని తిలకిస్తారు. మరోపక్క తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన మన బతుకమ్మను తిలకిస్తారు. ఇక్కడే కొందరూ మహిళలు బతుకమ్మను పేర్చుతూ పాటలు పాడుతారు.
- అక్కడ నుంచి హంపి థియేటర్‌కు చేరుకుంటారు. అక్కడ వీవీఐపీలతో పాటు సుందరీమణులు సోఫాల్లో కూర్చుని కార్యక్రమాలను అరగంటపాటు తిలకిస్తారు. ఇక్కడ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ స్వాతిచే రూపొందించిన ఇండో - వెస్టన్ ఇక్కత్ వస్త్రాలతో మోడల్స్ నిర్వహించే ర్యాంప్‌వాక్‌ను తిలకిస్తారు.
- తెలంగాణ టూరిజం శాఖ రూపొందించిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, పోచంపల్లి ఇక్కత్ ప్రాముఖ్యతను ఏవీ ప్రదర్శనను సైతం తిలకిస్తారు. అవసరం అనుకొంటే మిస్‌వరల్డ్ పోటీదారులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ఫొటోలు కూడా దిగుతారు.
- టూరిజం ప్రాంగణం ఇరువైపులా పల్లె వాతావరణం ప్రతిబింబించే గుడిసెల సెట్‌లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌ను పరిశీలిస్తారు. ఇక్కడ ఉన్న 10 స్టాల్స్‌లో పోచంపల్లి ఇక్కత్ స్టాల్స్ ఏడు, మిగతావి గద్వాల్, సిద్దిపేట గొల్లభామ, నారాయణపేట్ స్టాల్స్ ఉన్నాయి. ఇక్కడ కొకూన్స్ నుంచి వస్త్రం వరకు ఎలా తయారవుతుందో చేనేత మహిళలు వీరికి వివరిస్తారు.
- రెండో ప్రధాన ద్వారం వద్ద పూలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాప్స్ అలంకరణను తిలకిస్తారు. అక్కడి నుంచి తిరిగి బస్సులో హైదరాబాద్ వెళ్తారు.

నీలగిరికి రింగ్ రోడ్డు!

రెండు బైపాస్‌లు, ఒక హైవే కలుపుకొని నిర్మాణం

- జాతీయ రహదారుల మధ్య బైపాస్ రోడ్డుకు ఇప్పటికే టెండర్లు
- మర్రిగూడ ఫ్లై ఓవర్ నుంచి మెడికల్ కాలేజీ వరకు త్వరలో పనులు
- మెడికల్ కాలేజీ నుంచి అనిశెట్టి దుప్పలపల్లి వరకు మరో బైపాస్
- ఈ రోడ్డుకు రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్‌అండ్‌బీ
- ప్రభుత్వ ఆమోదం లభించగానే తదుపరి కార్యాచరణ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నీలగిరి పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు రాబోతోంది. ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో ఒక బైపాస్‌ను నిర్మించేందుకు చర్యలు చేపట్టగా, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో మరో బైపాస్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపింది. దీంతో పట్టణానికి ఒకవైపు నార్కట్‌పల్లి - అద్దంకి జాతీయ రహదారి ఉండగా, మరోవైపు జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో బైపాస్ రానుండగా, ఇంకోవైపు రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో మరో బైపాస్ వేయడం ద్వారా పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు రానుంది. ఇందులో భాగంగా రూ.250 కోట్లతో బైపాస్‌ను నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలను పంపించింది. నాగార్జునసాగర్ రోడ్డులోని మెడికల్ కాలేజీ సమీపం నుంచి అనిశెట్టి దుప్పలపల్లి వరకు ఈ బైపాస్‌ను నిర్మించనుంది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించగానే తదుపరి కార్యాయరణ చేపట్టనుంది. ఈ రెండు బైపాస్‌లు పూర్తయితే పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు రానుంది.

రింగ్ రోడ్డు నిర్మాణం మంత్రి లక్ష్యం

నల్లగొండ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖను చూస్తున్నారు. పట్టణానికి రింగ్ రోడ్డు వేయాలన్నది ఆయన లక్ష్యం. అందులో భాగంగానే ఆయన మంత్రి అయినప్పటి నుంచి పట్టణానికి రింగ్ రోడ్డు వేస్తానని చెబుతూ వచ్చారు. అయితే పట్టణం మధ్యలో నుంచి మాచర్ల - నకిరేకల్ జాతీయ రహదారిని గతంలో ప్రతిపాదించారు. పట్టణం వెలుపల ఇటు నకిరేకల్ వైపు, అటు మాచర్ల వైపు రోడ్డు పూర్తయిపోయింది. పట్టణంలో జాతీయ రహదారి వేయాలంటే పట్టణంలో విస్తరణ పనులు చేయాల్సి ఉంది. ఆ విస్తరణలో పట్టణంలో పెద్ద ఎత్తున ప్రజలు ఇళ్లు కోల్పోవాల్సి వస్తోంది. మరోవైపు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జాతీయ రహదారిని(ఎన్‌హెచ్) మార్చాలని ప్రజలు, వివిధ పార్టీల నేతలు పట్టుబట్టారు. దీంతో ప్రభుత్వం జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో మాట్లాడి, పట్టణం బయటనుంచి వెళ్లేలా చూడాలని కోరడంతో అందుకు ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పానగల్ నుంచి నార్కట్‌పల్లి- అద్దంకి హైవే వెంట మర్రిగూడ బైపాస్ జంక్షన్ మీదుగా, దేవరకొండ రోడ్డు, అక్కడ నుంచి ఎస్‌ఎల్‌బీసీ ప్రాంతంలో సాగర్ రోడ్డుకు బైపాస్ నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

ప్రభుత్వం ఓకే చెబితేనే రింగ్..

ఇక రెండో బైపాస్ రోడ్డును సాగర్ రింగ్ రోడ్డునుంచి అనిశెట్టి దుప్పలపల్లి వద్ద నార్కట్‌పల్లి - అద్దంకి జాతీయ రహదారికి కలిపేలా ఆర్ అండ్ బీ శాఖ కొత్త బైపాస్‌ను ప్రతిపాదించింది. 10.5 కిలోమీటర్ల పొడవునా దీనిని నాలుగు లేన్లుగా నిర్మించనున్నారు. రూ.250 కోట్లతో చేపట్టే ఈ రహదారి ప్రతిపాదలకు ప్రభుత్వం ఓకే చెబితే నల్లగొండకు రింగ్ రోడ్డు కల సాకారం కానుంది.

ఎన్‌హెచ్ బైపాస్‌కు భూసేకరణ..

జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి - అద్దంకి జాతీయ రహదారికి మాచర్ల - నకిరేకల్ జాతీయ రహదారిని అనుసంధానించేలా గత ఏడాది ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ బైపాస్ రోడ్డుకు సంబంధించి మూడు ప్రతిపాదనలను సిద్ధం చేయగా, మూడో ప్రతిపాదనకు ప్రభుత్వం ఓకే చెప్పింది. పానగల్ నుంచి నార్కట్‌పల్లి- అద్దంకి హైవే వెంట మర్రిగూడ బైపాస్ జంక్షన్ వరకు వచ్చి, అక్కడ నుంచి మర్రిగూడ శివారు ప్రాంతం మీదుగా దేవరకొండ రోడ్డు అక్కడ నుంచి ఎస్‌ఎల్‌బీసీ ప్రాంతంలో సాగర్ రోడ్డుకు కలిపే 3వ ఆప్షన్ అలైన్‌మెంట్‌ను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఓకే చేశారు. 15.5 కిలోమీటర్ల పొడవునా నాలుగు లేన్లుగా ఈ రోడ్డును నిర్మించేందుకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు. ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. అది పూర్తి కాగానే రోడ్డు నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కానుంది.

మస్తుగా 'ముందస్తు' ఆదాయం

ఎర్లీబర్డ్ ద్వారా ఏడు మున్సిపాలిటీల్లో రూ.14.28 కోట్ల పన్ను వసూలు



నల్లగొండలో పన్ను చెల్లిస్తున్న ప్రజలు (ఫైల్)

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీలకు ముందస్తు ఆదాయం భారీగానే వచ్చింది. జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీలు ఉండగా నందికొండ మున్సిపాలిటీ మినహాయిస్తే మిగతా ఏడు చోట్ల ఐదు శాతం రాయితీపై ప్రజలు రూ.14.28 కోట్ల ఆస్తి పన్ను చెల్లించారు. మున్సిపాలిటీల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈనెల 7వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ కింద 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పించిన విషయం తెలిసిందే. దాంతో జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లో మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆస్తి పన్ను ద్వారా ఆదాయం రాబట్టారు. మున్సిపాలిటీల్లో ప్రతి వార్డుకు ఇద్దరు ఉద్యోగులను పంపించి ఆస్తి పన్ను వసూలు అయ్యే విధంగా దృష్టి సారించి సక్సెస్ అయ్యారు.

రూ. 14.28 కోట్లు వసూలు...

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో 37 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎర్లీబర్డ్ కింద ముందస్తు పన్ను వసూలు చేయాలని నిర్ణయించి టార్గెట్ పెట్టుకొని పని చేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో సెలవుల రోజుల్లో కూడా ఉద్యోగులు వాణిజ్య భవనాల ఆస్తి పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపారు. దాంతో వారు పెట్టుకున్న లక్ష్యానికి దగ్గరగా ఏడు మున్సిపాలిటీలు రూ.14.28 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేశాయి.

వార్డు ఆఫీసర్లు రావడంతో...

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లను నియమించిన విషయం తెలిసిందే. ఒకప్పుడు మున్సిపాలిటీల్లో సిబ్బంది లేక నానా తంటాలు పడేవారు. వార్డు ఆఫీసర్ల నియామకంతో మున్సిపల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత తీరిపోయింది. కొత్తగా వచ్చిన వార్డు ఆఫీసర్లను వార్డుకు ఒకరి చొప్పున నియమించారు. వీరంతా వార్డుల్లో ఆస్తి పన్ను ఎక్కువ శాతం వసూలు అయ్యేందుకు చొరవ తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్తి పన్ను వసూలు కోసమే వార్డుల్లో తిరగడంతో పన్ను వసూలు సులభమైంది.

మున్సిపాలిటీల్లో పన్ను డిమాండ్ ఎర్లీబర్డ్‌లో పన్ను వసూలు (రూ.కోట్లలో..)

మున్సిపాలిటీ	భవనాలు	డిమాండ్	వసూలు
నల్లగొండ	43,281	17.60	7.45
మిర్యాలగూడ	26,699	22.59	3.22
దేవరకొండ	7234	2.26	0.86
చిట్యాల	3207	1.40	0.42
చండూరు	3685	69.92 (లక్షలు)	0.17 (లక్షలు)
హాలియా	5890	2.15	0.66
నకిరేకల్	9110	7.00	1.50

క్లుప్తంగా

బస్సును ఢీకొట్టిన డీసీఎం

- డ్రైవర్‌కు గాయాలు



నుజ్జునుజ్జయిన డీసీఎం ముందుభాగం

మునగాల: మునగాల శివారులోని ఓ హోటల్ ఎదుట శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే దారిలో కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు డ్రైవర్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా హైవేపై వాహనాన్ని నిలిపి ఉంచాడు. అదే దారిలో వెళ్తున్న డీసీఎం ట్రావెల్ బస్సును వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో డీసీఎం డ్రైవర్ చింతల అంజికి గాయాలు కాగా.. వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయింది. డీసీఎం యజమాని కృష్ణయాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ మల్లేశ్వరపు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



యాదగిరిగుట్ట: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రాత్రి 8గంటల సమయంలో సుమారు 70 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని ప్రెసిడెన్షియల్ సూట్ సమీపంలోని చెట్ల పొదల్లో పడి ఉన్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వెళ్లి, అతడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ భాస్కర్ వెల్లడించారు.

ధాన్యం అపహరణ

రాజాపేట: కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యాన్ని చోరీ చేసిన సంఘటన రాజాపేట మండలంలోని నర్సాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన నమిల శ్రీహరి ధాన్యం విక్రయించేందుకు నర్సాపురం కొనుగోలు కేంద్రంలో నిల్వ చేశాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం కుప్ప నుంచి సుమారు ఏడు క్వింటాళ్ల ధాన్యాన్ని అపహరించారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నాడు.

కాపర్‌వైర్ చోరీ

మునగాల: మునగాల మండల కేంద్రానికి చెందిన బోళ్ల రామిరెడ్డి సాగర్ ఎడమకాలువపై ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్‌తో పాటు బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ సంపద వనానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్‌లోని కాపర్‌వైర్ గురువారం అర్ధరాత్రి చోరీకి గురైంది. ఈ మేరకు మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు రామిరెడ్డి తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

చివ్వెంల(సూర్యాపేట) : బంగారం, వెండి ఆభరణాల చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత శుక్రవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేటలోని సీతారామపురం కాలనీకి చెందిన గంపల శ్యామ్, చివ్వెంల మండలం గుంజలూరు గ్రామానికి చెందిన రెడపంగి వీరబాబు గత సంవత్సరం పలు ఇళ్లలో చొరబడి, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ బి.హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ గంపల శ్యామ్‌కు 6 నెలల 21 రోజులు, వీరబాబుకు 3 నెలల 23 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ సీహెచ్, రవికుమార్ సహకరించారు.

గ్రామంలో అంతా సిమెంట్ కార్మికులే..

- మట్టపల్లి వాసులకు 42 ఏళ్లుగా పరిశ్రమే జీవనాధారం
- గ్రామంలో సగానికిపైగా పులిచింతల ముంపు బాధితులు
- స్థలాలు ఇచ్చినా నేటికీ నిర్మించి ఇవ్వని ఇళ్లు



మట్టపల్లి గ్రామ వ్యూ

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని కృష్ణానది ఒడ్డున గల మట్టపల్లి గ్రామస్తుల్లో ఎక్కువ మంది సుమారు 42ఏళ్ల క్రితం స్థానికంగా ఏర్పడిన నాగార్జున సిమెంట్ పరిశ్రమలోనే పనిచేస్తున్నారు. ఈ గ్రామంలో 15ఏళ్ల క్రితం వరకు వ్యవసాయ పొలాలు అంతంత మాత్రంగా ఉండేవి. అవి కాస్తా పులిచింతల ప్రాజెక్టు నిర్మాణంలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో పూర్తిగా మునిగిపోయాయి. సుమారు 120 ఇళ్లు కూడా ముంపునకు గురయ్యాయి. అయినా అందరూ మట్టపల్లిలోనే నివసిస్తూ స్థానిక పరిశ్రమ పరిధిలోని ఎన్‌సీఎల్, బైసన్‌బోర్డ్స్, ఆల్‌టెక్ కోటింగ్ ప్రొడక్స్ కంపెనీల్లో కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమ కాలనీని సింహపురి కాలనీగా పిలుస్తుంటారు. మట్టపల్లి గ్రామపంచాయతీ జనాభా సుమారు 2వేలు ఉంటుంది. అయితే పురుషుల్లో 80శాతం పైగా పరిశ్రమలో కార్మికులుగానే పనిచేస్తున్నారు. మిగిలినవారు కృష్ణానదిలో మత్స్యకారులుగా జీవనం సాగిస్తున్నారు. గ్రామం చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో మరో వృత్తికి, ఉద్యోగానికి అవకాశం లేదు. 1983లో పరిశ్రమ రాకముందు మట్టపల్లి కేవలం 11 ఇళ్లు ఉన్న కుగ్రామంగా ఉండేది. 1995లో ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడటంతోపాటు, పరిశ్రమ, దేవాలయంతో గ్రామానికి ఖండాంతర గుర్తింపు కూడా వచ్చింది. ఈగ్రామం అంతా సున్నపురాయితో కూడిన ప్రాంతం కావడంతో ఇక్కడ బోర్లు, బావులు ఏమీలేవు. కేవలం కృష్ణానది నీరే ఆధారం. ప్రతి కుటుంబం నుంచి ఒకరో ఇద్దరో పరిశ్రమపైనే ఆధారపడి జీస్తున్నారు. అయితే ప్రభుత్వం వారికి ముంపు కింద గ్రామానికి దూరంగా కేటాయించిన పునరావాస కేంద్రం తమకు వద్దని భీష్మించడంతో గ్రామానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 1లో ఇంటి ఖాళీస్థలాలు కేటాయించారు. కానీ ఇళ్లు నిర్మించలేదు. అందరికీ ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మట్టపల్లి గ్రామంలో 80శాతం మందికి పైగా సిమెంట్ పరిశ్రమలో కార్మికులు, కూలీలుగా పనిచేస్తున్నారు. ఇక్కడ పరిశ్రమలు తప్ప వేరే ఉపాధి మార్గం లేదు. అందరికీ పరిశ్రమలో పర్మినెంట్ అవకాశాలు కల్పిస్తే బాగుంటుంది. ప్రభుత్వం కూడా కార్మికులను ఆదుకోవాలి.

– చెన్నూరు మట్టపల్లిరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త, మట్టపల్లి

ఇళ్లు మంజూరు చేయాలి



ప్రభుత్వం దశాబ్దాల కాలంగా మట్టపల్లిలో ఉంటున్న కార్మికులకు, స్థానికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. పులిచింతల ప్యాకేజీలో ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా నిర్మాణం కాలేదు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మట్టపల్లి గ్రామస్తులకు న్యాయం చేయాలి.

– దాసరి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ, మట్టపల్లి

స్వస్తి వాచనంతో శ్రీకారం

ప్రారంభమైన శ్రీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు



స్వామి వారిని పరవాసుదేవుడిగా అలంకరించి గరుడ వాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు

- ఆలయంలో లక్ష కుంకుమార్చన, తిరు వేంకటపతి అలంకార సేవ
- రాత్రి పరవాసుదేవ అలంకారంలో భక్తులకు దర్శనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో శ్రీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలను శుక్రవారం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ప్రారంభించారు. ఉదయం ఆలయ ముఖ మండపంలో స్వస్తి వాచనంతో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం విష్వక్సేనారాధన గావించి, పుణ్యాహవాచనం వేడుకలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వయంభూలకు కంకణాధారణ చేసిన అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా యాదగిరి నృసింహస్వామి వారికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపించారు. అనంతరం తిరువేంకటపతి అలంకార సేవలో శ్రీస్వామి వారిని అలంకరించి తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు.

సాయంత్రం వేళ..

శ్రీస్వామి వారి ఆలయంలో సాయంత్రం సమయంలో నిత్య సామూహిక పారాయణాలు, అంకురారోపణం, హవనం నిర్వహించారు. స్వామి వారిని పరవాసుదేవుడిగా అలంకరించి గరుడ వాహనంపై ఊరేగించారు. ఆయా వేడుకల్లో ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతగుట్టలో..

పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సైతం శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వస్తి వాచనం, విష్వక్సేనారాధన, రక్షా బంధనం, లక్ష కుంకుమార్చన జరిపించారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణ, హవనం నిర్వహించారు.



ఉత్సవ మూర్తులకు పుణ్యాహవాచనం నిర్వహిస్తున్న ప్రధానార్చకులు



శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కంకణధారణ చేస్తున్న ప్రధానార్చకులు

మధుర జ్ఞాపకంగా మిగిలిపోయేలా ఏర్పాట్లు



టూరిజం పార్కులో వసతులు పరిశీలిస్తున్న స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, కలెక్టర్ హనుమంతరావు

- స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, పోచంపల్లి మిస్‌వరల్డ్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ లక్ష్మి

భూదాన్‌పోచంపల్లి: మిస్ వరల్డ్ పోటీదారులకు పోచంపల్లి పర్యటన ఓ మధురజ్ఞాపకంగా మిగిలిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, పోచంపల్లి మిస్‌వరల్డ్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం వారు పోచంపల్లి గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. ప్రధాన ద్వారం, స్టాల్స్ ఏర్పాటు, మ్యూజియం, మగ్గాల ప్రదర్శన, హంపీ థియేటర్‌ను పరిశీలించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, టూరిజంశాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, క్రైం డీసీపీ అరవింద్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, ఈవెంట్ ప్రతినిధి సతీష్, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షా నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ప్రమోషన్..

ఈ నెల 15న పోచంపల్లికి 25 మంది మిస్‌వరల్డ్ పోటీదారులు పోచంపల్లి సందర్శనకు వస్తున్నారని, ఫలితంగా పోచంపల్లి చేనేత పరిశ్రమకు అంతర్జాతీయ స్థాయిలో ప్రమోషన్ లభించడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు పెరగనున్నాయని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బతుకమ్మ, చేనేత స్టాల్స్, హంపీ థియేటర్‌లో వస్త్ర ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. రెండు గంటల పాటు ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణంలో వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు, చేనేతకార్మికులంతా సహకరించాలని కోరారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ లింగయ్య, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, ఏఎస్ఐ సైదిరెడ్డి తదితరులున్నారు.

కృష్ణానదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



అయోధ్య (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కృష్ణానదిలో గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం తమ్మారం గ్రామానికి చెందిన సూరగాని అయోధ్య (20)కు చెందిన పశువులు గ్రామ సమీపంలోని కృష్ణా నది తీరంలో మేతకు వెళ్తుంటాయి. వాటిని తోలుకొచ్చేందుకు ప్రతి రోజూ పడవలో వెళ్లే అతను గురువారం నదిలో ఈదుకుంటూ వెళ్లాడు. ఈక్రమంలో గల్లంతయ్యాడు. అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు కృష్ణానది వద్దకు వెళ్లి చూడగా చెప్పులు కనిపించాయి. నదిలో పడవల సాయంతో గాలించగా శుక్రవారం ఉదయం అయోధ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి పిచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితురాలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

నేరేడుచర్ల : బంగారం చోరీ కేసులో నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రెండు తులాల పుస్తెల తాడు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని గ్రంథాలయం వీధిలో ఈనెల 8న గుండా చంద్రకళ అనే వృద్ధురాలు ఇంటి వద్ద కూర్చొని ఉండగా అదే వీధిలో ఇళ్లలో పాచిపని చేస్తున్న అమరారపు మంజుల అనే మహిళ చంద్రకళ కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు అపహరించింది. బాధితురాలు పోలీసులకు సమాచారం అందించగా.. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. నేరేడుచర్ల బస్టాండ్ వద్ద మంజుల అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. దీంతో ఆమె చోరీ చేసినట్లు అంగీకరించింది. పుస్తెలతాడును రికవరీ చేసుకుని ఆమెను రిమాండ్‌కు తరలించారు. చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించడంతో నేరేడుచర్ల పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది వీరాంజనేయులు, బండి వెంకన్న, విష్ణు, శ్రీలత, సురేష్ తదితరులున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

రామన్నపేట: మండల కేంద్రంలోని వైన్స్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రామన్నపేట ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర వైన్స్‌లో ఈనెల 6న రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి వైన్స్ వెనుకభాగంలో వెంటిలేటర్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లోని రూ 2.35లక్షలను అపహరించాడు. సీసీ పుటేజీ ఆధారంగా సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్ఐ మల్లయ్య, ప్రొహిబిషన్ ఎస్ఐ వినయ్ దర్యాప్తు నిర్వహించారు. ఈక్రమంలో నార్కట్‌పల్లి బస్టాండ్ వెనుక నివాసం ఉంటున్న పసుపుల సారయ్య ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతడి నుంచి రూ 2.35లక్షలను రికవరీ చేశారు.

పత్తి కట్టె తీస్తుండగా ట్రాక్టర్‌పై పడిన విద్యుత్ స్తంభం

- మృతి చెందిన డ్రైవర్



ట్రాక్టర్‌పై పడిన విద్యుత్ స్తంభం



వెంకటేష్ (ఫైల్)

మోత్కూరు: వ్యవసాయ భూమిలో ఎండిన పత్తి కట్టెను ట్రాక్టర్ బ్లేడ్‌తో తొలగిస్తుండగా స్టే వైర్ తగిలి విద్యుత్ స్తంభం ట్రాక్టర్‌పై పడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొడిచేడు గ్రామానికి చెందిన జిట్ట ఎల్లయ్య, బుచ్చమ్మల కుమారుడు జిట్ట వెంకటేష్ (28) తన సొంత వ్యవసాయ భూమిలో ఎండిన పత్తి కట్టెను ట్రాక్టర్ బ్లేడ్‌తో తొలగిస్తున్నాడు. ఈక్రమంలో స్టే వైరుకు ట్రాక్టర్ బంపర్ తగిలి కరెంటు స్తంభం ట్రాక్టర్ నడుపుతున్న వెంకటేష్‌పై పడింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

జ్యూవెలరీ షాపులో చోరీ

- 27తులాల బంగారు ఆభరణాలు అపహరించిన దుండగులు



జ్యూవెలరీ షాపును పరిశీలిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ: జ్యూవెలరీ షాపు తాళాలను పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని విజయశ్రీ జ్యూవెలరీ షాపు యజమాని కాశె బ్రహ్మయ్య తన దుకాణాన్ని గురువారం రాత్రి 9గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో షాపులోని సీసీ కెమెరా పుటేజీని తన మొబైల్‌లో ఆన్ చేసేందుకు ప్రయత్నించగా కనెక్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే షాపు వద్దకు చేరుకోగా షెటర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా షాపులోని 27.4తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకుని షాపును, సీసీ కెమెరాలను పరిశీలించారు. కాగా.. గుర్తు తెలియని వ్యక్తులు జ్యూవెలరీ షాపులోని సీసీ కెమెరాల వైర్లను కట్‌చేయడంతోపాటు హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. ఈమేరకు నల్లగొండ నుంచి క్లూజ్ టీం అధికారులు వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు జ్యూవెలరీ షాపు వద్దకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించి బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రూరల్ సీఐ ప్రసాద్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు దుర్మరణం

- మృతులిద్దరిదీ గొర్రెల కాపరుల కుటుంబాలే
- గొర్రెలను మేపేందుకు హుజూర్‌నగర్‌కు వలస



లక్ష్మణ్, శేఖర్ మృతదేహాలు



లక్ష్మణ్ (ఫైల్)



శేఖర్ (ఫైల్)

హుజూర్‌నగర్ : యువకుడు బావిలో పడిపోగా.. అతడిని కాపాడబోయి మరో యువకుడు అందులోకి దిగాడు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీట మునిగి మృతిచెందారు. ఈ విషాదకర ఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన కన్మనూర్ తిరుపతయ్య, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన మోదిపురం లక్ష్మణ్‌లు మరో ఆరుగురితో కలిసి గొర్రెలను మేపుకుంటూ హుజూర్‌నగర్‌కు వచ్చారు. గత పది రోజులుగా పట్టణానికి చెందిన జక్కుల లింగయ్య పొలంలో మేత కోసం గొర్రెలను నిలిపి అక్కడే ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం తిరుపతయ్య కుమారులైన శేఖర్, చరణ్ వేసవి సెలవులు కావడంతో తండ్రి వద్దకు వచ్చారు. శుక్రవారం తిరుపతయ్య పెద్ద కుమారుడైన శేఖర్, గొర్రెల కాపరి లక్ష్మణ్‌తో కలిసి నీటిని తీసుకువచ్చేందుకు సమీపంలో గల లింగయ్య బావి వద్దకు వెళ్లారు. లక్ష్మణ్ (21) నీళ్లు పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు శేఖర్ (14)ప్రయత్నించగా అతను కూడా బావిలో పడ్డాడు. దీంతో ఇద్దరూ నీట మునిగి మృతిచెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతుడు శేఖర్ తండ్రి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

పాఠశాలల్లో వంట పాత్రల అపహరణ

నాగారం : పాఠశాలల్లో గుర్తు తెలియని వ్యక్తులు వంట పాత్రలు అపహరించారు. ఈ సంఘటన ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలల గదుల తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి వంట పాత్రలను చోరీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలుడు మృతి

భువనగిరిటౌన్: కారు ఢీకొని గాయాలపాలైన బాలుడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం భువనగిరి పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్డుపై ఆడుకుంటున్న దర్గాయి సామిక్ష (5) ను కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడి తలకు గాయాలు కావడంతో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఘట్‌కేసర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తహసీల్దార్ ఎదుట ముగ్గురు బైండోవర్

మునగాల: మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గురువారం రాత్రి పబ్లిక్‌కు న్యూసెన్స్ కలిగిస్తూ హైవేపై వచ్చే వాహనాలను ఇబ్బంది పెడుతున్న ముగ్గురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తాడువాయి తండాకు చెందిన వాంకుడోతు వంశీ, బరాఖత్‌గూడేనికి చెందిన సంఘం వంశీ, నల్లగట్టు వరుణ్ ఎక్కడా ఘర్షణలకు పాల్పడకుండా ఉండే విధంగా రూ.5లక్షలకు ఒక సంవత్సరం పాటు కాల పరిమితితో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి తిరుకల్యాణోత్సవాలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకళ్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని కూడా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం మూడో రోజు పరమపద ఉత్సవం నిర్వహించి సాయంత్రం స్వామివారి గరుడవాహన సేవను ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్షేత్ర అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు

మట్టపల్లి క్షేత్రం అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం రూ.2కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు అందినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ నిధులతో భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించడంతోపాటు, వివిధ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.



గరుడ వాహనంపై శ్రీస్వామిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు



విద్యుత్ దీపాలతో అలంకరించిన మట్టపల్లి దేవాలయం